# హరివిల్లు

## మాదిరెడ్డి సులోచన



అమరావతిలో రచయితల సభలు ఉన్నాయని ఆహ్వానించారు. వెళ్ళాలా వద్దా అని ఆలోచనలో ఉండగా మా వారు వెళ్ళమని బలవంత పెట్టారు.

"ఈ యాంత్రిక జీవితంనుండి రెండు రోజులయినా విముక్తి దొరికినా చాలు.." అన్నారు. సరే అని అంగీకరించాను. బయటికి వెళ్తుంటే సర్దటం ఓ యాతన, సర్దాక, మళ్ళీ వచ్చి యథాస్థానంలో పెట్టటం ఓ యాతన. అప్పగింతలు తప్పవు.

వీధిచివర పిన్నిగారిల్లు, వెళ్ళాను. అమ్మకు చిన్నమ్మ కూతురామె.

"అబ్బో!.... అబ్బో! ఎక్కడో చుక్క తెగి పడుతుంది" నవ్వింది పిన్ని.

"నాకు తీరదని తెలుసు. ఆడవారితో చేరితే మాటల స్వరూపం, స్వభావం మారుతుందని తెలుసు. ఒక చిన్న సహాయం అడగాలని వచ్చాను పిన్నీ" అని అన్నాను. ఆమె సంబరపడింది.

"వచ్చినప్పుడు ఒక కప్పు టీ ఇవ్వటం తప్ప మేము నీకు చెయ్యగల సహాయం ఏముందే తల్లీ." అన్నది పిన్ని.

ఆమెకు నాకు సహాయం చెయ్యాలని ఉంటుంది. వంటల్లో, పిండివంటల్లో అతిధులు వచ్చినప్పుడు పిలిచి సహాయం చేయించుకోవాలని ఉంటుంది. నా పరిధి నాకు తెలుసు.ఇచ్చి,పుచ్చుకోటాలుండాలి. నాకు వెళ్ళి సహాయంచేసే సమయంలేదు, చెయ్యలేను. అలాంటప్పుడు అడగటంలో అర్థంలేదు.

"నేను అమరావతి వెళ్తున్నాను పిన్నీ. ఆయన ఎక్కడో ఒకచోట తింటారు. మా మామగారికి హోటల్ తిండి పడదు. పనివాడికి చెయ్యటం రాదు. కాస్త రోజూ కూర పంపించు. ఒకసారి వెళ్ళి ఇల్లు చూచుకో" అన్నాను.

"అంతకంటేనా! అవును అమరావతి వెళ్తున్నావు కదూ! దార్లోనే సుగుణ ఉందే, వెళ్ళి చూచిరా." అన్నది.

"వీలుంటే తప్పక వెళతాను పిన్నీ." అన్నాను.

"వీలు, గీలు ఏంలేదు. వెళ్ళాల్సిందే. అంత దూరం వచ్చి ఇంటికి రాలేదంటే బాధపడుతుంది." అన్నది.

"తప్పక వెళ్తాను పిన్నీ" అన్నాను. నిజంగా అందరూ నన్ను అభిమానిస్తారు ఆ ఇంట్లో. అందరిలో సుగుణకు నేను అంటే వల్లమాలిన అభిమానం.

"సుగ్గీ.... సుగ్గీ" అంటూ ఏడ్పించే దాన్ని.

"దాని పెళ్ళికూడా తిరుపతిలో అయింది. నేను వెళ్ళలేకపోయాను. నేను వెళ్తానో లేనో అని అనుమానం కాబోలు, పిన్ని దానికి పెళ్ళికి చేయించటానికి వీలు కాలేదట, గొలుసులోకి జంటపావురాల లాకెట్టు చేయించింది, ఇచ్చింది.

అన్నీ తీసుకుని ప్రయాణమయ్యాను. అమరావతిలో సభలు చక్కగా జరిగిపోయాయి! మ్యూజియం చూచి, విజయవాడ బయలుదేరాం. అప్పుడు సుగుణ గుర్తుకు వచ్చింది.

"నేను రేపు వచ్చి మిమ్మల్ని కలుస్తానండీ." నా కూడా వచ్చిన కార్యకర్తలతో చెప్పి సుగుణ ఇంట్లోకి వెళ్ళాను.

సుగుణ సంతోషం ఇంతా అంతా కాదు. తనిల్లు తరించిపోయినట్టు చేసింది. సంతోషంగా కబుర్లు చెబుతూ కాఫీ, ఫలహారాలు ముగించాము.

"అమరావతి యెలా ఉంది?"

"అన్ని ఊళ్ళలా అది పాడు, బీడు కొడుతుంది. కాకపోతే కృష్ణానదిని చూస్తుంటే మాత్రం థ్రిల్లింగ్‌గా ఉంది." అన్నాను.

"పుష్కరాలప్పుడు గెస్ట్‌హౌస్‌కూడా కట్టారట."

"గెస్టుహౌస్‌లు, గుళ్ళూ బాగానే ఉన్నాయి. నేను ఎక్కువగా ఊహించినందువల్లనేమో అంతగా థ్రిల్లింగ్‌గా లేదు." అన్నాను.

"మావారయితే పడవ ప్రయాణం భలే ఊరిస్తారక్కయ్. మా వారిని చూడలేదు కదూ! క్యాంప్ కెళ్ళారు అక్కయ్యా" అన్నది.

అతను ఏదో పేరుమోసిన చార్టర్డ్ అకవుంట్స్ ఆఫీసులో పనిచేస్తున్నాడుట.

"చిన్నప్పటిలాగే పోట్లాడుతుంటావా మీ ఆయనతో...."

"అబ్బ! కాని మా ఆయన చాలా మంచివారక్కయ్యా. అసలు నాకు కాస్త శ్రమ కల్గితే ఓర్చుకోలేరు" అన్నది. అరమోడ్పు కన్నులతో, నేల చూపులు చూస్తూ.

"కంగ్రాచ్యులేషన్!" అన్నాను.

"థాంక్స్! వసంత గుర్తుందా అక్కా".

"నీ క్లాసుమేటు కదూ!"

"అవునక్కయ్యా! ఈ ఊళ్ళోనే ఉంది. అందగాడని, ఆడుతాడు, పాడతాడని మోజుపడి చేసుకుంది. ఇప్పుడు అనుభవిస్తుంది. అతను ఒట్టి తిరుగుబోతుట."అన్నది.

"సుగ్గీ! ఆడేవారు, పాడేవారు, మాలాంటివారం కాస్త స్వేచ్ఛగా తిరుగవలసిన అవసరం ఉంటుందే. అంతమాత్రాన కేరెక్టర్ లేనట్టా." అన్నాను నవ్వి. అమరావతికి వచ్చినవారిలో ఎక్కువ మంది రచయితలే. ఒకరిద్దరు రచయిత్రులున్నారు. అంతమాత్రాన తిరుగుబోతులనుకుంటే యెలా? భర్త వెళ్ళిన ప్రతి చోటుకు భార్య, భార్య వెళ్ళిన ప్రతీ చోటుకు భర్త వెళ్ళలేరు."

"అబ్బ నీకు తెలియదక్కా! విజయవాడ రేడియో స్టేషన్లో గర్ల్‌ఫ్రెండ్ ఉందట."

"బయట తిరిగే మగవారిలో అలాంటి శాతం ఎక్కువ. నువ్వు మనిషిని బంధించగలవుకాని, మనసును కాదుగా."

"అమ్మో! అలాంటి భర్త నాకు దొరికితే!" భయంగా చూచింది.

"ఏం చేస్తావ్! చూచీ, చూడనట్టు ఊరుకుంటావ్." అన్నాను ఆవులిస్తూ.

"నువ్వు మరీ తప్పుగా అంచనా వేస్తావు. అసలు ఎంగిలికూటికి ఆశిస్తానా! మా వారిని చూస్తే అలా అనవు," అన్నది.

"ఎంగిలికూటి కెవరూ ఆశించరే, పరిస్థితులకు లొంగిపోతారంతే." అన్నాను ఆవులిస్తూ.

"పరిస్థితులు! నాకు మాత్రం రావు. వసంత విషయం ఆయనతో చెప్పినప్పుడు ఏమన్నారో తెలుసా?"

"ఏమంటారు?"

"అలాంటి మగాడిని షూట్ చెయ్యాలంటారక్కా."

"అదో బలహీనత! బయట తిరిగే మగాడికి సవాలక్ష అలవాట్లని మగాడు సరిపెట్టుకుంటాడులేవే. అంతా కాకపోయినా ఎక్కువ శాతం మగవారు, వీధిలో కృష్ణయ్యలే." అన్నాను.

"నయం అందరూ అనలేదు...."

నేను పడుకుంటే వచ్చి నా ప్రక్కన కూర్చుంది. ఏమో చెప్పాలని తెగ సిగ్గుపడిపోయింది.

"ఏమిటే?"అన్నాను ప్రోత్సాహంగా.

"మావారింట్లో చాలా స్ట్రిక్ట్ అట అక్కయ్యా! సినిమా చూచి, పుస్తకాలు చదివి దాంపత్యం అంటే ఇలా అని నేనయినా కొంత ఊహించి, గ్రహించాను గాని ఆయన ఒట్టి బుద్ధవతారం అనుకో," అన్నది ముసిముసిగా నవ్వుతూ.

భర్తతో పంచుకున్న ఏ సంఘటన గుర్తుకు వచ్చిందో ఏమో పిచ్చిపిల్ల, అనుకున్నాను. నాకు నిదుర ముంచుకు వస్తుంది. గెస్టుహౌస్‌లో వసతిగా ఉన్నా, కొత్త ప్రదేశం కావటంవల్లో ఏమో నిదుర రాలేదు. సుగుణ ఇల్లు కొత్త ప్రదేశం అయినా నిదుర ముంచుకు వచ్చింది.

సుగుణ వాళ్ళాయన మంచితనం గురించి, అతను తనను ఎంత ప్రేమగా చూస్తాడో చెబుతుండగా, నేను గాఢ సుషుప్తిలోకి జారిపోయాను.

పువ్వులు వెదజల్లినట్టు, మెత్తని నవ్వులు దగ్గరలో వినిపించేసరికి ఉలిక్కిపడి కళ్ళు విప్పాను. గదిలో ఒక మూలకున్న బీరువా దగ్గర పురుషుడు చొక్కా విప్పుతున్నాడు. పక్కనే సుగుణ నిలబడింది.

"ఉష్ అక్కయ్య లేస్తుంది."

"అబ్బా! ఏమిటోయ్ అక్కయ్య, అక్కయ్యంటూ భర్తనుమరిచిపోయావా!"

"అబ్బ అదికాదండీ. పాపం పరాయి చోటు, రెండు రోజులుగా నిదురపోలేదట."

"నీకోసం నేను అంత దూరంనుండి వస్తే...."

"అబ్బ ఊరుకుందురూ...." ఇద్దరూ బయటికి వెళ్ళాక లేచాను. ఆవులిస్తూ బయటికి వచ్చాను.

"మీ మరిది వచ్చారక్కా! స్నానం చేస్తున్నారు." అన్నది.

చిన్నగా నవ్వాను.

"ఇదిగో నాకోసం తెచ్చారు పూలు," అన్నది సంబరంగా. నాకు సంతోషంగా ఉంది. సుఖ సంతోషాలు బంగళాలలో, పట్టుచీరలలో లేవు. అనుభూతులలో అనుకున్నాను.

"నువ్విలా రా అక్కయ్యా! ముగ్గురం భోజనం చేద్దాం." అన్నది సుగుణ. దాని కళ్ళు ఆనందం అంచులు మించేమో తళతళలాడుతున్నాయి.

"అలాగే" అన్నాను. గదిలోకి వచ్చి చెదిరిన జుట్టు సరిచేసుకున్నాను.

నేను ఇటు తిరిగేసరికి సుగుణ, దాని భర్త నిలబడి ఉన్నారు.

"మా పెద్దమ్మ కూతురు, రచయిత్రి అని చెప్పాను.... మావారు మూర్తిగారు అక్కయ్యా" అన్నది సుగుణ.

నవ్వబోయి ఆశ్చర్యంగా చూచాను. అతని పని అంతే అయింది.

"మీరు.... కృష్ణ.... కృష్ణ...." అన్నాను.

"అవునక్కా! కృష్ణమూర్తిగారే. ఆ పేరంటే కృష్ణుడి బుద్ధులు వస్తాయని, మా మామగారు మూర్తి అని పిలవమని అన్నారు." గలగల నవ్వింది సుగుణ. వెంటనే నవ్వాపింది.

"మావారు నీకు తెలుసా అక్కయ్యా!"

"ఎప్పుడో చూచారు. మీ బావగారి బడిలో కొన్నాళ్ళు నేను డ్రిల్లుమాస్టారుగా పనిచేశాను.... అయినా భోజనాల వద్ద సోది ఏమిటి సుగుణా! వడ్డించు." అన్నాడు మూర్తి.

అతని కంగారు అర్థమైపోయింది.

"అవునే. మా పెళ్ళయిన కొత్తలో అనుకుంటాను.... మీ బావగారప్పుడు ఏదో తాలూకా హెడ్‌క్వార్టర్‌లో పని చేసేవారు. అక్కడ చూచాను."అన్నాను.

"అదా! అదేమిటండీ, టీచర్‌గా చేసానని ఎప్పుడూ అనలేదు." అన్నది సుగుణ.

దాని ప్రశ్న క్యాజువల్‌గా వచ్చింది. కాని ఆ పుణ్య పురుషుడు కంగారుపడి పోయాడు.

"అబ్బే.... టీచర్‌గానా! ఆ వృత్తి అంటే నాకు ఎలర్జీ! అప్పుడెంత పదవ తరగతి పాసయి, ఊరికే ఉంటే డ్రిల్లు మాష్టారుగా.... టెంపరరీగా అపాయింట్ చేశారంతే.... కదండీ...." అన్నాడు.

"అవునవును." అన్నాను. అతను ఆరాటంగా సుగుణను కంగారుపెట్టి భోజనానికి కూర్చున్నాము. భోజనాలు అయినంతసేపూ అతను పరాకుగా ఉన్నాడు.

"అక్కయ్యా! ఒక్క నిముషం మీరు కబుర్లు చెప్పుకుంటూ ఉండండి. వంటిల్లు చక్కబెట్టి వస్తాను." వెళ్ళి పోయింది సుగుణ.

"చూడండి సుగుణను పెళ్ళిచేసుకోక ముందు మీ జీవితం యెలా గడిచిందో



అనవసరం. ఇప్పుడు చక్కగా కాపురం చేసే దంపతులను విడదీసే సంకుచితురాలిని కాను. నిశ్చింతగా ఉండండి....." అన్నాను.

"అబ్బే.... అదికాదు....." ఏదో చెప్ప బోయాడు. సుగుణ వచ్చింది.

"అక్కయ్యా! మా ఊరు డప్పా థియేటర్‌లో సినిమా చూస్తావా!" సంబరంగా అడిగింది సుగుణ.

"సినిమా వద్దు సుగుణా! రేపు ప్రెస్ కాన్ఫరెన్సు ఉంది. నేను వెళ్ళాలి. హాయిగా కబుర్లు చెప్పుకుందాం." అన్నాను.

"ఈ పూటే వెళ్ళిపోతే ఆయన బాధ పడతారే," అన్నది.

"కాదు. నాకు థాంక్స్ చెబుతారు. ఏమంటారు మరిదిగారూ!"

"అబ్బే.... ఓ రెండురోజులుండండి ...." అన్నాడు.

"మరోసారి వస్తానులెండి." అన్నాను. అతన్ని రాత్రి బస్సుకు టికెట్ తెచ్చి పెట్టమన్నాను. అతను వెళ్ళిపోయాడు.

"మావారు డ్రిల్లు టీచరుగా ఉండేవా రంటున్నావు, బాగా తెలుసా?"

"చూచాను అంతే, అప్పుడు నేను వయసులో ఉన్నాను కదా...." అన్నాను. అది ఎంత అసందర్భమో నాకు తెలుసు.

"అక్కయ్యా! నువ్వేం అనుకోకే. ఈ వారపత్రిక తిరగవెయ్యి. అయిదు నిమిషాలలో వచ్చేస్తాను. మా మహిళా మండలికి నిన్ను పిలుద్దాం అనుకున్నాను. నువ్వేమో వెళ్ళిపోతానంటున్నావు. నా దగ్గర ఫ్రెండే కనకదుర్గ. వెళ్ళి చెప్పొస్తాను." అన్నది.

"వెళ్ళు...." అన్నాను. ఒక్కసారి నా ఆలోచనలు ఎనిమిది, తొమ్మిది సంవత్సరాల వెనక్కు వెళ్ళాయి. మావారు పెళ్ళికాగానే తను పనిచేస్తున్న తాలూకా హెడ్‌క్వార్టర్స్‌కుతీసుకువెళ్ళారు. అక్కడ అందరిలోకి మా ఇల్లే పెద్దది. దాదాపు టీచర్లంతా వచ్చేవారు. హెడ్‌మాష్టారు ఓరోజు వచ్చాడు.

"యెలా వాసూ! ఈ కృష్ణతో వేగలేక పోతున్నాను. ఇది కో-ఎడ్యుకేషన్ స్కూల్ అని మరిచిపోతే యెలా!"

"మళ్ళీ ఏమయింది సర్!"

"పదవ తరగతిలో రమను ఏమో అన్నాడట."

"రేపు నేను మందలిస్తాను." మా వారు హామీ ఇచ్చారు. టీ తాగి హెడ్ మాస్టారు వెళ్ళిపోయారు.

"ఎవరండీ ఈ కృష్ణ!" అన్నాను.

"మా స్కూలు డ్రిల్లు మాస్టారు క్రాంతీ. మెట్రిక్ మూడుసార్లు తప్పాడట. డ్రిల్లు మాష్టారుగా పంపాడు. ఫ్యామిలీ ఉంది. అయినా చూచిన ఆడపిల్లనల్లా అనుభవించా లనుకుంటాడు." అన్నారాయన.

ఆ విషయం మర్చిపోయాను. ఈయనగారు స్పోర్ట్స్ అంటూ, లాబ్ వర్క్ అంటూ ఆరు, ఏడు గంటలకు వస్తారు. ఇంట్లో విసుగనిపించి, ఇంటివాళ్ళ కోడళ్ళు, కూతురు వెళ్తుంటే గుడికి వెళ్ళాను.

"నిలువవే వాలుకనులదానా!" అంటూ పాట వినిపించింది.

"పాడు సన్యాసి...." అనుకుంటూ వాళ్ళు హడావుడి పడిపోయి, నడక వేగం హెచ్చించారు.

"యెవరు?" అన్నాడు.

"వాడే కృష్ణగాడు.... టీచర్." నాకు కుతూహలం హెచ్చింది. త్వరగా వెళ్ళాలని పట్టుబట్టారు. తలఎత్తి చూచాను. ఇద్దరు యువకులు నిల్చున్నారు. ఒకతను నేను చూడగానే కాలరెత్తాడు.

నా కలాంటి వారిని ఏడిపించడం సరదా.

"ఇలా వస్తారా!" చప్పట్లు కొట్టాను. ఇంటివారి కోడలు భయంగా చూచింది.

"నన్నేనా.." నీరుకారిపోతూ వచ్చాడు.

"ముగ్గురు....కాదు నల్గురం ఉన్నాం. యెవరివి వాలుకనులు." అన్నాను.

ఆ వెంటఉన్న మరో యువకుడు పరుగునవచ్చి చెవు ఏలోదో చెప్పాడు.

"వాసుమాష్టారి భార్య...." అనటం వినిపించింది.

అతను ఏమనుకున్నాడో ఏమో, నా వంక ఎగాదిగా చూచి వెళ్ళిపోయాడు. వెంటఉన్న అతను పరుగులే పెట్టాడు.

"చూచారా, మగాడిని చూచి నీరుగారి పోతూ, సిగ్గుల మొగ్గలయితే ఇలాగే ఉంటుంది." అన్నాను, కాస్త విజయ గర్వంతో. తప్పు నాది కాదు. ఆ వయసు అలాంటిది.

అందరం ఇంటికి వచ్చాము. ఈ విషయం ఆయనతో చెబితే బావుంటుందా! అవసరం అనుకుంటే చూద్దాం అనుకున్నాను. ఆ రోజు వారు పదకొండింటికి వచ్చారు. నిదురకళ్ళతో వడ్డించి పడుకున్నాను. మర్నాడు లంచ్ అవర్లో వచ్చారు. వస్తూనే పకపక నవ్వేశారు.

"క్రాంతీ! నువ్వు ఈ ఊళ్లో బాయ్ ఫ్రెండ్స్‌తో విచ్చలవిడిగా తిరుగుతున్నావని నాకు రిపోర్ట్ వచ్చింది."

"ఈ రోజునుండి నామీద సి.ఐ.డీ.లను వెయ్యండి." అన్నాను.

"వాడి చెంప పగలగొట్టి ఉండేవాడిని. మళ్ళీ నిన్నేమయినా అంటాడని ఊరుకున్నాను. ఈడియెట్, పెళ్ళాం ఉంది. కూతురు ఉంది. పాడుబుద్ధులు." అన్నారాయన.

"అసలు ఏం చెప్పాడు?"

"వాసుగారూ! మీరు చాలా ఫార్వర్డ్! మీరిక్కడ పనిచేస్తుంటే మీ భార్య బాయ్‌ఫ్రెండ్స్‌తో తిరుగుతుంది" అన్నాడు. నాకు ఒల్లు మండింది. 'మనము రోజుకో గర్ల్‌ను వెతుక్కోవటంలేదూ, అలాగే వాళ్లు' అన్నాను" అన్నారు.

"ఈ విషయం అందరితో చెబుతాదేమో."

"వాడి ముఖం వాడి మాట నమ్మే దెవడు. తప్పుచేసినవాడి నింకా తప్పులోకి తొయ్యవద్దని నేను మాట్లాడుతాను. యెవడూ మాట్లాడడు" అన్నారు. ఆ విషయం మరిచిపోయాను.

శుక్రవారం పదిగంట లప్పుడు, స్కూలు అటెండర్ ఎల్లయ్య వచ్చాడు.

"అమ్మా.... అమ్మా! కృష్ణమాష్టారి ఫ్యామిలి వస్తుంది.... ఫ్యామిలి" అన్నాడు. నాకు కుతూహలం పెరిగింది. ఈ అల్లరి కుర్రాడికి యెలాంటి భార్యో! ముక్కుకు తాడేస్తుందో, ముగ్గురాలో అనుకున్నాను. ఎదురు వెళ్లాను. ఒక నలభై ఏళ్లావిడ, ఆవిడ వెంట లంగా, ఓణీ వేసుకున్న పన్నెండేళ్ల అమ్మాయి వచ్చారు.

అమ్మాయి కృష్ణకు చూడు, జోడు బాగానే ఉంది. ఇంకా బాల్యవివాహాలు అమలులో ఉన్నాయి కాబోలు, అనుకుంటూ ఎదురువెళ్లి చాపవేసి ఆహ్వానించాను.

"మావారు మరీ, మరీ చెప్పారు, వాసుగారి భార్యను పేరంటానికి పిలువమని...." పెద్దావిడ బొట్టు పెట్టింది.

"మీరు...."

"కృష్ణగారి భార్యను. ఇది మా అమ్మాయి. వరలక్ష్మీ వ్రతం. తప్పక రండి" అన్నది. గోడను ఆనుకుని నిలబడవలసి వచ్చింది.


కృష్ణ భార్యా! కోరమీసాలతో కుర్రాడిలా కనిపించే కృష్ణ భార్యా! కొందరు వయసు దాచుకుంటారేమో!

"తప్పక రావాలక్కయ్యా...." ఆ పిల్ల నా చెయ్యి పట్టుకుంది.

"తప్పక వస్తాను. కూర్చోండి. టీ తాగి పోదురుగాని," అన్నాను.

"వద్దమ్మా. ఇంకా పిలవాలి" అన్నదామె. ఆమె పేరు మంగళట, అమ్మాయి పేరు శర్మిష్ఠ.

నేను తేరుకోవటానికి చాలా సేపు పట్టింది. ఆ విషయం మరిచిపోదాం




అనుకుంటుండగా సాయంత్రం కృష్ణ అమ్మాయి వచ్చింది.

"మీకు మా ఇల్లు తెలియదని వచ్చాను" అన్నది.

తప్పదని తయారయి వెళ్లాను.

అంతా పెద్దవారే ఉన్నారు. ఆ వీధిలో బ్రాహ్మణులే ఎక్కువ ఉన్నట్టున్నారు. అందరూ గుంటూరు చీరలు కట్టుకుని, చక్కగా ఉన్నారు. అందర్లో కాస్త ఫ్యాషన్‌గా నేనే కనిపించానేమో. అందరికీ నేను ఒక వింత పదార్థంలా ఉంది.

"ఒక పాట పాడు...." అంటూ తలా ఒక ప్రశ్న వేసారు.

"నేను వెళ్తానండీ...." లేచాను. ఈ స్త్రీశక్తిని తట్టుకోవటం కష్టం అనిపించింది.

"వాసుగారిది మీ కులమేనా!"

"మీది ప్రేమ వివాహమా పెద్దలు కుదిర్చిన పెళ్ళా!"

"మీ ఆయన కాస్త ముదురు!"

అమ్మనాయనోయ్ .... అందుకే లేచాను. 'వీరనారీమణీ' అంటూ అంతరాత్మ హేళనచేసింది.

"అబ్బ! ఉండండి, మావారితో మాట్లాడాలి. మీరు చాలా అదిట.... ఏది...." అన్నది.

"సోసియల్...." కూతురు అందించింది.

"అమ్మబాబోయ్...." మరో బాంబు!

"చీకటవుతుంది. నేను వెళ్ళాలి" అన్నాను కచ్చితంగా. ఆవిడ అయిష్టంగా లేచింది.

"తాంబూలం ఇవ్వకున్నా వెళతారా?" అడిగింది మంగళ.

"ఆలస్యం అవుతుంది. వెళతాను."

"వరలక్ష్మీవ్రతం చేసాక, తాంబూలం తీసుకోందే వెళ్లకూడదు. అరిష్టం."

"నాకా నమ్మకాలు లేవు." లేచాను. ఆవిడ తాంబూలం ఇచ్చింది. తీసుకుని బయటికి వచ్చాను. అక్కడ స్త్రీలంతా అలా ప్రశ్నించారంటే ఏదో బలమయిన కారణం ఉండి ఉంటుంది. ఆలోచిస్తూ ఇంటికి వచ్చాను. ఆ చుట్టుపక్కల పేరంటాలు పిలువటంతో ఆనాటి విషయం మరిచిపోయాడు.

మూడురోజుల తరువాత మధ్యాహ్నం ఎల్లయ్య మావారి టిఫిన్ కోసం వచ్చాడు.

"అయ్యగా రింటికి రాలేరంటనమ్మా" అన్నాడు.

“మీ కృష్ణ మాష్టారి భార్య యెలా ఉంది!” మామూలుగా ప్రశ్నించాను.

“తప్పుడుముండ! దాని పేరెత్తకమ్మ....” అన్నాడు.

ఒక అటెండరు, ఒక టీచర్ భార్యను అలా అవమానించటం సహించలేకపోయాను.

“నోరు పారేసుకోకు. ఏమిటా మాటలు!” అరిచాను.

“లేకపోతే ఏమిటమ్మా! ఇరవై ఏళ్ల కుర్రాడికి, నలభై ఏళ్ల అడదా! పోనీ మగబుద్ధలు, మోటుబుద్ధులు అనుకుందామన్నా, వాసుబాబుమీద తప్పుడు ప్రచారం. మిమ్మల్ని లేవదీసుకు వచ్చాడట. మీరు సంసారపక్షం కావట.” పకపక నవ్వాను.

భలేగా ఉంది కామెంటు.

“నేను పెళ్లికొచ్చాను కాబట్టి నమ్మలేదు.” అన్నాడు ఎల్లయ్య. ఆలోచిస్తూ ఉండిపోయాను. కళ్లు మూసుకుని పాలు త్రాగే పిల్లి కథలా వుంది.

అయిదారు రోజులకు కృష్ణ అసలు కథ తెలిసింది. ఆవిడ భార్య కాదుట. ఇద్దరూ కాపురం పెట్టారట. కృష్ణ తండ్రి, పినతండ్రి వచ్చి, కృష్ణను ఉద్యోగం మాన్పించి తీసుకుపోయారు. ఆవిడ భర్తను వదిలిందట.

“వీడికింత చరిత్ర పెట్టుకుని ఇతరులకు కథలు అంటకడతాడా” అని వాసు ఆశ్చర్యపోయాడు.

రెండు సంవత్సరాలవరకు కృష్ణను గుర్తుకుతెచ్చుకునే అవసరం ఏం రాలేదు. నేను హైద్రాబాద్ వచ్చి, బియిడి చేసి ఉద్యోగంలో చేరగానే, మనిషి అవసరం అనుకున్నాను. మాకు అబ్బాయి పుట్టాడు. తెలిసినవారెవరో పనిపిల్లను తెచ్చారు.

తీరా చూస్తే ఆ అమ్మాయి కృష్ణమూర్తి కూతురుగా పరిచయం అయిన పిల్ల, శర్మిష్ట. కొన్ని పేర్లు మరిచిపోలేం.

“అక్కా! మా అమ్మ అందరిని వదిలి వచ్చింది. ఆ కృష్ణ వెళ్లిపోయాక, అమ్మ, నేను, పట్నం వచ్చి, పాచి పనులు చేసుకుంటున్నాము.” అన్నది. జాలేసింది. మంగమ్మను మంగళగా మార్చేడట కృష్ణ.

ఒకరోజు తల్లి కూడా వచ్చి బడిలో అటెండర్‌గా వేయించమని బ్రతిమాలింది. మన కంత పరపతి ఎక్కడిది! మనకు తెలిసిన షావుకార్ల ఇంట్లో ఉంచాను. తల్లీ కూతుర్లకు కలిపి రెండు వందలిస్తారు. భోజనం అక్కడే. మంగమ్మ కూతుర్ని తీసుకుని అప్పుడప్పుడు వస్తుంది.

అలా మరచిపోయిన కృష్ణమూర్తి, రూపంలో పిన్ని కూతుర్ని చేసుకుని, బుద్ధిమంతుడుగా చలామణి అవుతున్నాడంటే సంతోషమే. ప్రతీ భార్యా, తన భర్త మంచివాడేనని నమ్మితే మంచిదే. ఆ నమ్మకమే కాపురం నిలబెడుతుంది. అనుకోకుండా కళ్లు మూతలుపడ్డాయి. అరగంట గాఢ నిద్రలో గడిపి లేచాను. కళ్లు కడుక్కుందామని బాత్‌రూమ్ వైపు వెళ్లాను.

“ఆ టీచర్ భార్యే రచయిత్రి అని నాకేం తెలుసు.” అంటున్నాడు మూర్తి.

“అందుకా మీరామెను చూచి తెల్లబోయింది.” ఆశ్చర్యంగా అనుగుతోంది సుగుణ.

“అవును సుగుణా! ఆమె గురించి నీకెలా చెబుతాను! గ్రంథసాంగురాలులే. రెండు జడలేసుకుని, సినిమాస్టార్ ఫోజులనుకో. అందుకే అప్పటి విషయాలు బయట పెడతానని నీతో నా గురించి ఏవయినా అబద్దాలు చెబుతుందేమో ఆమె మాటలు నమ్మొద్దు.” అంటున్నాడు.

“అమ్మో! ఇక నమ్ముతానా! మీరు లేకపోతే చెప్పేదేమో ఎంత నంగనాచి....” అంటున్నది సుగుణ.

నేను వెనక్కువచ్చి కూర్చున్నాను. నా గురించి ఏంచెప్పి ఉంటాడు! సుగుణ నన్ను నంగనాచి అనేస్థితికి వచ్చిందంటే ఏం చెప్పి ఉంటాడు! ఆలోచిస్తూ కూర్చున్నాను.

“ఇదుగో టికెట్టు....” సుగుణ బస్ టికెట్టు ఇచ్చింది.

“బస్ ఎక్కాక కొనవల్సిందే, కాని మీ పేరుచెప్పి ఆమె కొనలేరని తెచ్చాను.” అన్నాడు, మూర్తి.

నేను మామూలుగా ఉండాలని ప్రయత్నం చేశాను.

“మీ ఫ్రెండ్స్ ఎవరోవస్తారన్నావు.”

“ఇంట్లో లేరు.”

నిప్పులమీద ఉన్నట్టుంది సుగుణ స్థితి. నేను టీ త్రాగేశాను.

“మనుషులు రాసేదానికి చేసేదానికి సమన్వయం ఉండదు.” అన్నది.

ఉంది, ఉండి ఇదేం నాన్చుడు! ఐనా చిరునవ్వుతో అడిగాను.

“యెవరి విషయం సుగ్గీ!”

“ఇంకెవరు! మీ రచయిత్రులు.” అన్నది.

“ఎంతమంది రచయిత్రుల నెరుగుదువు?” అన్నాను.

జవాబు చెప్పలేదు. నేను పేపరు చదువుతూ సాయంత్రంవరకు గడిపాను. మా ఇద్దరి మధ్య అడ్డుతెర పడినట్టు ఫీలయ్యాను. కృష్ణమూర్తి ముందే అతని విషయం చెప్పాలనుకున్నాను. పోనీలే నేను చెడ్డదాన్ని అయినా ఓ కాపురం నిలబెట్టాను అనుకున్నాను. బస్ ఎక్కాక అసలు వాళ్ళ విషయమే మర్చిపోయాను. నా పుస్తకాలు నా ఇంటర్వ్యూ మాత్రమే గుర్తుంది.

విజయవాడలో ఒక రోజుండి ఇల్లు చేరాను. మూడ్రోజులకు పిన్ని వచ్చింది.

“సుగుణ యెలా ఉందే?”

“సుగుణ బావుంది పిన్నీ!” అన్నాను అక్కడ ఉండిభోజనంచేశానని చెప్పాను.

“ఏమోనే అమ్మా! దూరం సంబంధం. పెళ్ళయి, అది కాపురానికి వెళ్లాక




తెలిసింది, అల్లుడు గ్రంథసాంగుడని. దాన్ని ఏం బాధలు పెడుతున్నాడోనని" అన్నాది పిన్ని దిగులుగా.

"కుర్రాళ్ళు తెలిసీ తెలియని వయసులో ఏమో చేస్తారు. ఎప్పటికీ అలాగే ఉంటారా పిన్నీ!" అన్నాడు! అన్నాను. కంటిలో నలుసులా, సుగుణ ఇంట్లో జరిగిన సంఘటన నన్ను కృంగదీస్తుంది.

జనవరిలో ఇదంతా జరిగింది. ఫిబ్రవరి రెండున మామయ్య కూతురి పెళ్ళి జరిగింది. ఆ పెళ్ళికి సుగుణ కృష్ణమూర్తి వచ్చారు. నాతో ముభావంగా ఉంది.

పెళ్ళికొడుకు మంగమ్మ పనిచేసే వారింటిలో అద్దెకుంటాడట. మంగమ్మ, కూతురు పెళ్ళికి వచ్చారు. ఆమె కృష్ణమూర్తిని గుర్తుపట్టింది. ఆరోజు రాత్రి పిన్నిగారింటికి వచ్చింది.

"ఏదో మీ ఆవిడతో గుట్టుగా కాపురం చేసుకుంటున్నావ్. నా దగ్గర తీసుకున్న బంగారం ఇచ్చెయ్యి. నా పిల్ల వెళ్ళి చేస్తాను." అని నిలదీసిందట. నాకు కబురు వచ్చింది.

వెళ్ళలేదు. వెళ్ళినా ఏం చెబుతాం! పిన్ని, బాబాయి కూతురి కాపురం నిలబెట్టాలని, మంగమ్మకు రెండు కాసుల బంగారం ఇచ్చి పంపేసారు.

మర్నాడు అయిదు గంటలప్పుడు మా ఇంటి బెల్లు మోగింది. పాలవాడేమోనని తలుపు తీసాను. మూర్తిభవించిన శోక దేవతలా ఉంది సుగుణ.

"అక్కయ్యా.... నన్ను.... నన్ను క్షమించవే...." అన్నది.

"నువ్వేం తప్పు చేసావే...." అన్నా తెచ్చి, కూర్చుబెట్టుకుని. వేదాంతిలా నవ్వింది.

"యెవరు రాసారోగాని మోసకారి కామదాసుల మాటలు నీటి మూటే అని అక్షరాలా నిజం అక్కయ్యా." అన్నది ఏడుస్తూ.

"జీవితం ఓ హరివిల్లు సుగ్గీ! ఎన్నో రంగులు, ఎన్నో చిత్రాలు. ధైర్యంగా ఉండాలి," అన్నాను ఓదార్పుగా.

జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పటికయినా బుద్ధిగా ఉంటే బావుండును. కాని ఉంటాడా! సినిమా కాదు మార్పు అంత తొందరగా రావటానికి. "సుగ్గీ! ఒక్క విషయం! పదే, పదే ఆ తప్పు గుర్తుచేసి, తప్పుచేయాటానికి రాజబాట వెయ్యకు. ఏం జరుగనట్టే ప్రవర్తించు." అన్నాను.

"ప్రయత్నిస్తాను."

"ప్రయత్నం కాదు. నిజంగా నువ్వలా చేయాలి. అదెంత బాధో నాకు తెలుసు. అయినా తప్పదు." అన్నాను. సుగుణ కళ్ళు తుడుచుకుని వెళ్తానని లేచింది. జాలిగా చూచి సాగనంపాను.